క్లుప్తంగా

సామాజిక వేత్త సుదర్శనం మృతి



సుదర్శనం (ఫైల్)

జనగామ: జన్మనిచ్చిన జనగామ గడ్డతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మందికి సహాయ, సహకారాలు అందించిన మానవతా వాది, సామాజిక సేవా కర్త, ప్రముఖులు నాగబండి సుదర్శనం(94) శుక్రవారం మృతి చెందారు. సామాజిక, ఆధ్యాత్మిక రాజకీయ సేవ కార్యక్రమాల నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించారు. సుదర్శన్ మరణం కుటుంబ సభ్యులతో పాటు ఆర్యవైశ్య సమాజం, స్థానికులకు తీరని లోటు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన అనేక కార్యక్రమాల్లో భాగస్వాములై, జనగామ వైశ్యుల కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేశారు. భక్తి, ఆధ్యాత్మిక, రాజకీయ, సామజిక తదితర రంగాల్లో అభిరుచి కలిగిన ఆయన మంచి వక్తగా పేరు పొందారు. లింగాలఘనపురం మండలం జీడికల్ దేవస్థానం చైర్మన్‌గా పని చేసిన సమయంలో ఏపీలోని గుంటూరులో స్వామి ఆస్తులను పరిరక్షించిన ఆధ్యాత్మిక వేత్త. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పని చేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకున్నారు. సుదర్శన చనిపోయినా.. తన కళ్లను దానం చేసి ఇద్దరికి చూపినిచ్చారు. కుటుంబ సభ్యుల అనుమతి మేరకు ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రతినిధులు కళ్లను సేకరించి, ధ్రువ పత్రాన్ని అందించారు. సుదర్శనంకు ఇద్దరు కుమారులు నాగ బండి రవీందర్, ఉపేందర్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ప్రముఖుల సంతాపం



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ మంత్రి పొన్నాల

జనగామ: జీడికల్ రామచంద్రస్వామి దేవాలయం మాజీ చైర్మన్ నాగబండి సుదర్శనం మృతి బాధ కలిగించిందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్‌లో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి, ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. అలాగే మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మృతుని స్వగృహంలో భౌతిక ఖాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, ఎండీ మాజీద్, బిజ్జాల నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు. అలాగే ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పోకల లింగయ్య, పజ్జూరి జయహరి, గాదె శ్రీనివాస్ తదితరులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాఘవాపూర్ గ్రామానికి చెందిన బింగి రవీందర్(33) ఆర్థిక ఇబ్బందులతో గురువారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకటేష్ అందించిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రవీందర్ ప్రైవేటు ఫైనాన్స్ నడుపుతుంటాడు. ఈ క్రమంలో ఫైనాన్స్‌లో నష్టం రావడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో మనస్థాపం చెంది గురువారం ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందుతాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



కరీంబీ (ఫైల్)

బచ్చన్నపేట: కట్కూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మహ్మద్ కరీంబీ(105) గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలుకు కుమారుడు జమాలొద్దీన్‌తో పాటు మనుమరాళ్లు, మనుమలు, మునిమనుమలు, మనుమరాండ్లు దాదాపు వంద మంది వరకు ఉన్నారు. కరీంబీ బతికినంతసేపు ఆరోగ్యంగా ఉందని, ఆమె మృతి పట్ల గ్రామస్తులు, నాయకులు, తదితరులు సంతాపం తెలిపారు.

గుండెపోటుతో మహిళా రైతు..

స్టేషన్‌ఘన్‌పూర్: కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒంటెల రాములమ్మ(50) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందింది. గ్రామానికి చెందిన రాములమ్మ ఉదయం ఇంటివద్ద పనిచేస్తుండగా ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రాగా కిందపడింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేటు వైద్యులకు చూపించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా ఆమె మృతిచెందిన విషయం తెలుసుకున్న భూమాత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెవుల యాదగిరితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు.

కాల్వలకు గండ్లు..!

- చెరువులు నిండకుండా అడ్డంకులు
- రైతుల మధ్య వివాదాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



తూము పక్క నుంచి ప్రత్యేకంగా ట్రెంచ్ తీసి కుంటలోనికి నీటిని మళ్లిస్తున్న దృశ్యం



మండల కేంద్రంలోని పాత చెరువులోనికి నీటిని మళ్లించే ప్రయత్నంలో రైతులు

లింగాలఘణపురం: మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయగా ప్రధాన కాల్వలకు ఉన్న తూముల నుంచి వస్తున్న నీటి ప్రవాహం తక్కువగా వస్తుందని అడ్డుగా కట్టలు వేయడమే కాకుండా తూము పక్క నుంచి గండ్లు తీస్తున్నారు. దీంతో మండల కేంద్రంలోని పాత చెరువులోనికి నీరు వెళ్లకుండా చిన్నచిన్న కుంటలు నింపుకుంటున్నారని రైతుల మధ్య వివాదం ఏర్పడింది. శుక్రవారం కళ్లెం నుంచి బండ్లగూడెం చెరువులోనికి వెళ్తున్న కాల్వకు అడ్డంగా వేసి నీటిని కుంటలోనికి మళ్లించుకుంటున్నారని లింగాలఘణపురం రైతుల మధ్య వివాదం ఏర్పడింది. దీంతో గ్రామస్తులంతా కలిసి కుంటలోనికి వెళ్లకుండా పాత చెరువులోనికి వెళ్లే విధంగా మళ్లించారు. మండల కేంద్రంలోని పాత చెరువు నిండితే మండల కేంద్రంతో పాటు బండ్లగూడెం, కొత్తపల్లి, పటేల్‌గూడెం రైతుల బావులు, బోరుబావుల్లో నీటి ఊటలు మళ్లుతాయనే ఆశతో ఉన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ నీటిపారుదల శాఖ అధికారులు కాలువ వెంట పర్యవేక్షణ చేయడంలేదు. ఒక్కసారిగా కాలువల్లో నీటి ప్రవాహం చూడడంతో రైతులు ఎవరు ఆగడంలేదు. తమకు అనుకూలంగా మళ్లించుకుంటున్నారు. ఇప్పటికైన అధికారులు పర్యవేక్షణ చేసి కాలువల వెంట నీరు వెళ్లే విధంగా చివరి ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలిగే విధంగా చూడాలని కోరుతున్నారు.

రైతులు తొందర పడొద్దు

రైతులు తొందర పడొద్దు. ఇంకా వర్షాకాలం ముందు ఉంది. అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. ముందుగా చివరి ఆయకట్టు వరకు నీటిని పంపించాలనే లక్ష్యంతో విడుదల చేయడం జరిగింది. వర్షాలను దృష్టిలో పెట్టుకొని వర్షాభావ పరిస్థితులను చూస్తూ రైతులకు నీటిని విడుదల చేస్తాం.
– రవికుమార్, డీఈ, నీటిపారుదల శాఖ

ఆసియా పారాతైక్వాండో పోటీల్లో కృష్ణవేణి ప్రతిభ



స్టేషన్‌ఘన్‌పూర్: జూలై 28 నుంచి 31వ తేదీవరకు మలేషియాలో జరిగిన 10వ ఏషియన్ పారా తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని తానేదార్‌పల్లికి చెందిన మాచర్ల కృష్ణవేణి ఉత్తమ ప్రతిభతో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇండియా తరపున ఉమెన్ సీనియర్ పీ 52 విభాగంలో పోటీల్లో పాల్గొన్న కృష్ణవేణి ఉత్తమ ప్రతిభ కనబర్చి తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏషియన్ పారా తైక్వాండో పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపడం సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా సహకరించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఏషియన్ పారా తైక్వాండో పోటీలలో ఉత్తమ ప్రతిభ చాటిన కృష్ణవేణిని పలువురు అభినందిస్తున్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డు ప్రదానం



ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అందిస్తున్న కలెక్టర్

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన పసురూరి సురేష్, రమ్యల కుమారుడు రాజా ఏకాంబరం అనే విద్యార్థికి శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డును కలెక్టర్ రిజ్వాన్‌బాషా అందించారు. గత నెలలో హర్యానా రాష్టానికి చెందిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డు (ఐబీఆర్) అచీవర్ పేరుతో నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొని సంస్థ ప్రతినిధులు అడిగిన ప్రశ్నల్లో 28 రాష్ట్రాల రాజధానులు, ఆరు జాతీయ చిహ్నాలు, 26 ఇంగ్లిష్ పదాలు, 19 రకాల పండ్ల పేర్లు, మానవ శరీరంలోని 14 రకాల అవయవాల పేర్లు, మహాత్మగాంధీ బయోగ్రఫీ, 23 జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన ప్రశ్నలను కేవలం 4 నిమిషాల్లోనే సమాధానం చెప్పాడు. దీంతో వారు అందించిన అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా శుక్రవారం అందుకున్నాడు. విద్యార్థిని కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌పీ నర్సయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్‌పీ నర్సయ్య అన్నారు. ఉపాధి హామీ పథకం పనులపై మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న సోషల్ అడిట్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని తాటికొండ గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు, ఈజీఎస్ అధికారుల సమక్షంలో సోషల్‌అడిట్ నిర్వహించారు. ఎస్‌ఆర్‌పీ మాట్లాడుతూ ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని, అవకతవకలకు పాల్పడితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 6వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల స్థాయి సోషల్ అడిట్ ప్రజావేదిక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌పీ శ్రీనివాస్, ఈసీ ఎస్.కిరణ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఎం ప్రేమయ్య, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కారోబార్ నరేష్, బిల్‌కలెక్టర్ సలీమ్, ఎఫ్‌ఏ రేణుక తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో ప్రజావాణికి హాజరైన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: హైదరాబాద్ గాంధీ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పౌరుల వినతులను స్వీకరించి అక్కడికక్కడే సంబంధితశాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. భూ సమస్యలు, పెండింగ్ పింఛన్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్య సమస్యలు వంటి అంశాలపై వినతులు స్వీకరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సన్మానం



జనగామ రూరల్: దేశ వ్యాప్తంగా నిర్వహించిన న్యాస్ ఫలితాల్లో జిల్లా 50వ స్థానాన్ని దక్కించుకుంది. జిల్లాలో విద్యా వ్యవస్థను సమర్థంగా పర్యవేక్షించి, పాఠశాలలు, కళాశాలలు సందర్శించి విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను ముస్లిం మైనార్టీ నాయకులు శుక్రవారం కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. హంసాత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మహమ్మద్ యాకుబ్ పాషా, ఆర్టీసీ కాలనీ ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సివిల్ జడ్జికి..



రఘునాథపల్లి: రఘునాథపల్లికి చెందిన సోముల యాకయ్య–పార్వతి దంపతుల కూతురు అశ్విని పట్టుదలతో చదివి ఇటీవల వెలువడిన ఫలితాల్లో తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన విషయం విదితమే. అశ్విని తండ్రి యాకయ్య రైల్వే ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు అశ్విని జడ్జిగా ఎంపిక కావడం పట్ల యాకయ్య సహచర రైల్వే ఉద్యోగులు శుక్రవారం రఘునాథపల్లికి చేరుకుని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

వరమహాలక్ష్మి చల్లంగా చూడమ్మా

- జిల్లా వ్యాప్తంగా శ్రావణ మాస పూజలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు

జనగామ: ఆధ్యాత్మికంగా విశిష్టమైన శ్రావణ మాసం రెండో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాలను జరుపుకున్నారు. అమ్మవారి అనుగ్రహం, అష్టైశ్వర్యాలు కలగాలని లక్ష్మీమాతను వేడుకున్నారు. ఉపవాస దీక్ష చేపట్టి వరలక్ష్మీమాతను నిష్టతో కొలిచి మొక్కారు. వరలక్ష్మి ఆశీస్సులు పొందేందుకు కలియుగంలో సులువైన మార్గం వరలక్ష్మీ వ్రతాన్ని ప్రతీ ఇంట జరుపుకున్నారు. సిరిసంపదలు, భోగభాగ్యాలు, సుమంగళి భాగ్యం కలగాలని మాతను వేడుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి.



జనగామ: బతుకమ్మకుంటలో విజయదుర్గా దేవికి లక్ష పుష్పార్చన



జనగామ: సంతోషిమాతను దర్శించుకుంటున్న భక్తులు



జనగామ: దుర్గాదేవి ఆలయంలో భక్తులు



జనగామ: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



పాలకుర్తి టౌన్: సోమేశ్వరాలయంలో సహస్ర లలితా పారాయణం నిర్వహిస్తున్న మహిళలు

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులకు చదువు ఎంత అవసరమో పోషకాహారం అంతే అవసరమని, పిల్లలకు అందించే ఆహారం, వారి ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. నమిలిగొండ శివారులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో రాజయ్య ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలు, కిచెన్, ఆహారపదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో, వంట సిబ్బందితో, ఉపాధ్యాయినిలతో మాట్లాడారు. ఆయన వెంట లకావత్ చిరంజీవి, గణేష్, గుండె మల్లేష్, ప్రసాద్, సారయ్య తదితరులు ఉన్నారు.

50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

పాలకుర్తి టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న మద్యం పాలసీలో గౌడ కులస్తులకు 50 శాతం రిజర్వేషన్ కేటాయించాలని మోకు దెబ్బ రాష్ట్ర అధికారి ప్రతినిధి కమ్మగాని వెంకటేశ్వర్లుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పాలకుర్తిలో మాట్లాడుతూ గత ప్రభుత్వం గీత కార్మికులు 15 శాతం రిజర్వేషన్ అమలు చేసిందని, టెండర్ డ్రాలో రుసుమును రూ.50 వేలకు కుదించి గౌడ కులస్తులను అదుకోవాలన్నారు. 50 శాతం రిజర్వేషన్ తోపాటు ప్రతి వైన్స్ షాపులో గౌడ కులస్తులకు ఉద్యోగం అవకాశాల కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కృష్ణమూర్తి పోరాటాలు చిరస్మరణీయం



దేవరుప్పుల: నివాళులర్పించిన రమేశ్ తదితరులు

దేవరుప్పుల: నాటి భూస్వామ్య, నిజాం రజాకారుల దౌర్జన్యాలను ఎదిరించేలా ప్రజల్లో విప్లవాగ్ని రగిలించిన ధీరుడు కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి పోరాటాలు చిరస్మరణీయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నీర్మాలకు చెందిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత కాసం కృష్ణమూరి వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం ఆధ్వర్యంలో ఆయన స్మారక స్థూపానికి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సీపీఎం మండల కార్యదర్శి ఇంటి వెంకట్‌రెడ్డి అధ్యక్షత వహించగా రమేశ్ మాట్లాడారు. ప్రజల కోసం అనేక ఆటుపోట్లు నిర్బంధాలను అధిగమించి పీడిత ప్రజల పక్షాన నిలిచిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్రను పోషించారు అన్నారు. విపత్కర పరిస్థితి ఎదురైనప్పుడు మెలకువగా, చాకచక్యంగా వ్యవహరించడంలో బహునేర్పరి ఐలమ్మ భూ పోరాటం, దొడ్డి కొమురయ్య నేలకొరిగిన ఉదంతం నుంచి కాసం కార్యాచరణ ముమ్మురమైందని వారన్నారు. కార్యక్రమంలో పయ్యావుల బిక్షపతి, కాసర్ల యాదవ రెడ్డి, మాధవ రెడ్డి, యాది రెడ్డి, అయోధ్య, హుస్సేన్, నర్సిరెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి ఆశయాలను కొనసాగిస్తాం

స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి టౌన్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు కాచం కృష్ణమూర్తి ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో కాచం కృష్ణమూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశ్‌ముఖ్ దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన మహత్తర పోరాటం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. ఆపోరాటంలో రాష్ట్రంలోనే అగ్రగణ్యుడిగా,జనగామ ప్రాంతం నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలలో సాయుధ పోరాట రూపకల్పనలో కీలకభూమిక పోషించిన మహనీయుడు కృష్ణమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, నాయకులు కొడెపాక యాకయ్య, చిలుముల భాస్కర్, మంద మహేందర్, బోసు రాజు, నీల శ్రీనివాస్, నిమ్మల రాజు, చుంచు రాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో కాచం కృష్ణమూర్తి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమసత్యం నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఏనుగతల రాజు, సారయ్య, అబ్బాస్, సమ్మయ్య, సందీప్, వెంకటమ్మ, అమరేశ్వరి, వెంకన్న, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి



కొడకండ్ల: నిరుపేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం రజిత అన్నారు. శుక్రవారం హక్యాతండా ప్రాథమిక పాఠశాలలోని 23 మంది విద్యార్థులకు దాతలు చల్లా ప్రవీణ్‌రెడ్డి–స్పందన దంపతులు అందించిన రైటింగ్ టెబుల్స్‌ను హెచ్‌ఎం అందజేశారు.

కుట్టుమిషన్ అందజేత

జనగామ రూరల్: వాసవీ క్లబ్ గెలాక్సీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్ కుమార్ సహకారంతో ఆయన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం పేద మహిళలకు కుట్టు మిషన్ అందజేశారు. అలాగే అంబేద్కర్ నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో అంగన్‌వాడీ పిల్లలకు మాదంశెట్టి రమేష్ చంద్ర సహకారంతో పిల్లలకు పలకలు, వాటర్ బాటిళ్లు అంగన్‌వాడీ కేంద్రానికి ట్యూబ్ లైట్ అందజేశారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

పాలకుర్తి: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపారు. విస్నూరు శివారులో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సేషన్‌కు తరలించి సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

దేవరుప్పుల: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి నైతిక బాధ్యతగా తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ప్రిన్సిపాల్ అరుణాకర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూమ్, తదితర కాలనీల్లో మురికి నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేశారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

జనగామ రూరల్: మండలం గానుగుపహడ్, చిటకోడూర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ అన్నారు. శుక్రవరం బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు కరుణాకర్ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలను ఆయన సందర్శించి మాట్లాడారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కొడకండ్ల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుత సీజన్‌లో దోమలు వ్యాప్తి చెంది అనేక రోగాలకు కారణం కానునందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి హరికృష్ణ సూచించారు. శుక్రవారం నర్సింగాపురంలో డ్రైడేలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

బాలికలకు ప్రశంసలు



దేవరుప్పుల: హనుమకొండలోని ఫాతిమానగర్ బాలవికాసలో నిర్వహించిన నివాసం యోగ్యమైన భూ వనరుల పరిరక్షణ అనే అంశంపై లీడ్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబర్చగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఇటీవల జిల్లా స్థాయిలో చిన్నమడూరు హైస్కూల్‌కు చెందిన బాలికలు తెలుగు వ్యాసరచనలో బి.అంజలి, ఆంగ్ల వ్యాసరచనలో శ్రీశార్వరి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి, హనుమకొండ ఫాతిమానగర్‌లోని బాల వికాసలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో పాల్గొని సర్టిఫికెట్లు పొందినట్లు హెచ్‌ఎం కళావతి తెలిపారు.

'ఝాన్సీరెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నాయకులకు లేదు'

పాలకుర్తి టౌన్: టీపీసీసీ ఉపాధ్యక్షులు హనుండ్ల ఝాన్సీరెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నాయలకు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాయలంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఐకేపీ ఏపీఎంగా శోభారాణి



దేవరుప్పుల: మండల కేంద్రంలోని చందన మండల సమాఖ్య కార్యాలయంలో ఐకేపీ ఏపీఎంగా పేరాల శోభారాణి విధుల్లో చేరారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన ఏపీఎం వెంకటరెడ్డి సూర్యాపేట జిల్లా నూతనకల్లుకు బదిలీ కాగా అదే జిల్లా నాగారంలో విధులు నిర్వర్తిస్తున్న శోభారాణికి ఇక్కడికి వచ్చారు. మండలంలోని మహిళా సంఘాలు ఆర్థిక బలోపేతం తోపాటు స్వయం సమృద్ధి సాధించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

సెర్ప్ ఏపీఎంగా నాగేశ్వర్‌రావు



లింగాలఘణపురం: మండలంలో సెర్ప్ ఏపీఎంగా బచ్చన్నపేట మండలం నుంచి బదిలీపై వచ్చిన కె.నాగేశ్వర్‌రావు శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేసిన మేకల శంకరయ్య జనగామ మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఏపీఎంగా విధుల్లో చేరిన నాగేశ్వర్‌రావును సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించగా బదిలీపై వెళ్లిన శంకరయ్యకు వీడ్కోలు పలికారు.

పరామర్శ

నర్మెట: మాజీ ఎంపీపీ ఇమ్మడి శోభారాణి భర్త మహేందర్ (45) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వెల్దండలోని మృతుడి స్వగృహానికి పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం వెళ్లి కుటంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఆటో డ్రైవర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సంక్షేమ పథకాలు అందించాలి

రఘునాథపల్లి: ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకోవాలని సంఘం మండల అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆగస్టు 1వ తేదీ ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బస్టాండు నుంచి ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు గూడు, కూడు

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోనే పేదలకు సొంతింటి గూడు, కూడు కల్పన సాకారం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బోనగిరి నరసింహ అన్నారు. గురువారం పెద్దమడూరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు.

భూమిపూజ

బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్లలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గ్రామ మాజీ సర్పంచ్ ఖలీల్‌బేగమ్‌ఆజామ్ శుక్రవారం భూమిపూజ చేశారు.

ఎన్నిక



క్రాంతి కుమార్

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మత్స్యశాఖ గ్రామ అధ్యక్షుడుగా పొన్నెబోయిన క్రాంతికుమార్‌ను శుక్రవారం ఆ గ్రామ కులసంఘ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా చూస్తానని తెలిపారు.

రెడ్డి సంఘం కమిటీ..



దేవి ఎల్లారెడ్డి, అధ్యక్షుడు

ఆలింపూర్ గ్రామ రెడ్డి సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవి ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా పోరెడ్డి అనంతరెడ్డి, దండ్యాల మల్లారెడ్డి, కార్యదర్శిగా పెద్దపాటి కర్ణాకర్ రెడ్డి, కోశాధికారిగా పాతూరి యాదిరెడ్డి, సహాయ కార్యదర్శిగా పిట్ట మహేందర్ రెడ్డి, సలహాదారులుగా గంట తిరుమల్‌రెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సంతోష్‌రెడ్డి, సిద్దారెడ్డి, రంగారెడ్డి, సుదాకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, హైమావతిలను ఎన్నికయ్యారు.

దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: 2025–26 సంవత్సరానికి గాను హైదరాబాద్‌లోని రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ఒక సీటు ఖాళీగా ఉందని, ప్రవేశం కొరకు జిల్లాకు చెందిన షెడ్యూల్ కులాల బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి డాక్టర్ బి. విక్రమ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.